## ఈ దేశపు గాయాలు బాగా తెలిసిన చింతనాశీలి, సామాజిక శాంతి విప్లవాకారుడు - డా॥ రామ్ మనోహర్ లోహియా

డా॥ అవధానం రఘు కుమార్

ఈ మ ధ్య ఒక పని మీద ప్రొ. కుప్పా శ్రీనివాస శాస్త్రి గారిని కలిసి మాట్లాడుతుంటే మా మాటల్లో డా. లోహియా ప్రస్తావన వచ్చింది. నాకు లోహియా రచనలతో తొలి పరచియం షుమారు 1984-85లో ప్రారంబం అయ్యింది. ఎంత చదివినా ఏదో తెలియని ఒక కొత్త కోణం ఆయన రచనలలో కనబడుతూనే వుంటుంది. శాస్త్రి గారు తను కూడా లోహియా గురించి కొంత చదివానని, ఉస్మానియా యూనివర్సిటిలో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేటప్పుడు ప్రొ. శేశవ రావు జాధవ్ గారు తనకు లోహియా వ్రాసిన ఒకటి రెండు పుస్తకాలు ఇచ్చారని, అవి చదివి చాలా ప్రభావితం అయ్యాయని అన్నారు. అయితే అన్నిటికన్నా విచిత్రమేమిటంటే శాస్త్రి గారు మాటల మధ్యలో నేను ఎప్పుడూ వినని ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. "లోహియా, జార్జ్ వాల్లేస్ లు వారి దేశాల గాయాలు బాగా తెలిసిన వ్యక్తులు'' అన్నారు. నాకు శాస్త్రి గారి మాట సరిగ్గా అర్థం కాలేదు. కొంచెం వివరించండి అన్నాను.

శాస్త్రి గారు అన్నారు: "ప్రతి దేశంలో ఆ దేశ ప్రజల గాయాలు, హృదయ స్పందన, సమస్యలు అర్థం చేసుకుని వాటికి పరిష్కారాలు సూచించే జ్ఞానులు ఉదయిస్తారు. అయితే చాలా మంది అలాంటి జ్ఞానులు ఏదో ఒక వర్గపు లేదా ఒక సమూహపు సమస్యలని అర్థం చేసుకుంటారు. వాటి ఆధారంగా పరిష్కారాలు సూచిస్తారు. చరిత్రలో చాలా తక్కువ మంది జ్ఞానులే తమ సమాజపు గాయాలని సమగ్రంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. అందులో ఇంకా కొంది మంది మాత్రమే వాటికి పరిష్కారాలు సూచించే ప్రయత్నం చేస్తారు''. మరి లోహియా ఈ దేశపు గాయాలు బాగా అర్థం చేసుకున్నారా? వాటికి పరిష్కారాలు సూచించారు? అన్న నా ప్రశ్నకు శాస్త్రి గారు జవాబు పూర్తిగా ఇవ్వలేదు. అయితే ఆయన "లోహియా, జార్జ్ వాల్లేస్‌లకు వారి దేశాల గాయాలు బాగా తెలుసు. అంత వరకు ఖచ్చితంగా చెప్పగలను, కానీ ఆ గాయాలకు మందు కనుక్కున్నారా అంటే చెప్పలేను'' అన్నారు.

దాదాపు ఐదు వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గా ఈ దేశపు, లేదా ఈ సమాజపు గాయాలు చాలా పురాతమైనవి, తీవ్రమైనవి. సంఖ్యాపరంగా అనేకమైనవి. తెలిసిన, గుర్తున్న చరిత్రలో ఇన్ని దాడులు, దండయాత్రలకు గురైన సమాజం, ప్రజలూ, ప్రాంతం ఇంకొకటి లేదేమో! ప్రతి వంద, రెండు వందల చరిత్రలో ఎప్పుడూ ఏదో ఒక కొత్త దాడి, కొత్త సర్దుబాటు, కొత్త పాఠం, కొత్త విలువలు. బహుశః ప్రపంచ చరిత్రలో ఇంత వెసులుబాటు లేకుండా, నిరంతరం ఏదో ఒక సంక్షోభంతో సతమతమైన ప్రాంతం కూడా ప్రపంచ పటంలో ఇకోటి ఉండదేమో. అయినా దాదాపు క్రీ.శ. ఒకటి నుండి నిన్న మొన్నటి దాకా (అంటే 18వ శతాబ్దం వరకు) ప్రపంచ వస్తు వుత్పత్తిలో ఒకటి, రెండు స్థానాలలో వుంది.

18వ శతాబ్దపు తొలి దశలో దాదాపు 27% వాటా జిడిపితో ప్రపంచ పటంలో మొదటి స్థానంలో వుంది. దీని సంపూర్ణ పతనం బ్రిటిష్ వారి రాకతో మొదలైంది. స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలైని ఇంకా చరిత్ర, గతం చేసిన పుండ్లు మానలేదు అవి అంత చిన్న గాయాలు కావు, సులభమైన పరిష్కారాలు కూడా కనబడటం లేదు. ప్రతి వ్యక్తికి, ప్రత సమూహానికి ప్రక్క వ్యక్తిపై లేదా ప్రక్క సమూహంపై ఏదో ఒక ఫిర్యాదు. ఇన్ని ఫిర్యాదుల గుట్టలు బహుశః వేరే ఏ దేశంలోనూ, సామాజిక సమూహాలలోనూ లేవేమో? ప్రతి సమూహపు ప్రతినిధి, కాస్తో కూస్తో అక్షర జ్ఞానం వున్న ప్రతి వ్యక్తి ఒక మార్గం సూచిస్తూ ఇదే అంతిమ పరిష్కారం అని అంటున్నా గాయాలు, బాధలు ఇంకా పెరుగుతున్నాయి, సమీప భవిష్యత్తులో స్పష్ఠత చేకూరే అవకాశం కనబడటం లేదు.

ఈ దేశపు చరిత్రతో పోల్చుకుంటే అమెరికా చరిత్ర చాలా చిన్నదే. సహజంగా గాయాల సంఖ్య, తీవ్రత కూడా ఈ దేవంలో పోల్చుకుంటే చిన్నవే. జార్జ్ వాలేస్‌ని శాస్త్రి గారు లోహియాతో పోల్చడం వల్ల ఈ జార్జ్ వాలస్ గురించి కొంత తెలుసుకునే ప్రయత్నం చేశాను. అమెరికన్ సమాజపు గాయాలు - వలస వాదులు (Whites), మూల వాసులు (Native Red Indians) మధ్య ఘర్షణలు, మూల వాసుల ఏరివేత, అలాగే ఆఫ్రికన్ నల్ల వారిని బానిసలుగా బయటి ఉండి తేవడం, వారి శ్రమ దోపిడీ పై తమ కాపిటలిస్ట్ సమాజ నిర్మాణం, వారి స్వేచ్ఛ-సమానత్వ ఘర్షణలు, అనేక ఏషియన్, లాటిన్ అమెరికన్ ప్రాంతాల ప్రజల వలసలు, వాటి వల్ల వచ్చిన కొత్త ఘర్షణలు... ఎంత శోధించినా అయిదు లేదా ఆరు వందల ఏళ్ల గాయాలు !

జార్జ్ వాల్లేస్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి. అలబామా గవర్నర్. చాలాసార్లు దేశ అధ్యక్ష పదవికి డెమోక్రాటిక్ అభ్యర్థిగా ప్రయత్నించినా కుదరలేదు. ఎందుకంటే ఆయన దేశంలో తెలుపు - నలుపుల Segregation ని చాలా కాలం సమర్థించారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తెలుపు - నలుపుల మధ్య జరిగే integration ని ఒప్పుకోలేదు. చివరలో తన సైద్ధాంతిక ప్రాతిపదికను కొంత మేర వదులుకున్నారు. అయినా అమెరికన్ ప్రజలు ఆయన దేశాధ్యక్ష పదవి కోరికని మన్నించలేదు. అయితే ఆయన అమెరికా రాజకీయాలపై తీవ్రమైన ప్రభావాన్నే చూపించాడు అని చరిత్ర చెబుతోంది. "ఓటమి పాలైన అత్యంత ప్రభావ శీలి" (The most influential loser) అనే నెగెటివ్ ప్రఖ్యాతి సంపాదించాడు.

లోహియాకు, జార్జ్ వాల్లేస్‌కు మధ్య నిజానికి ఏ పోలికలూ లేవు. నిజం చెప్పాలంటే జార్జ్ వాల్లేస్ ప్రతి రూపం లోహియా. లోహియా ఈ దేశంలో అన్నీ వివక్షలన్నీ వ్యతిరేకించాడు. అమెరికాకు వెళ్ళినా ఒక హోటల్‌లో రంగుల వారిని అనుమతించరని తెలిసి, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా సంఘర్షించి, సత్యాగ్రహం చేసి అరెస్ట్ అయిన ఏకైక భారత దేశపు రాజకీయ నాయకుడు. ఇంటా, బయటా అన్ని అసమానతలను, వివక్షతలను వ్యతిరేకించిన వ్యక్తి. కేవలం ఆర్థిక అసమానతలను అధిగమించినంత మాత్రాన సమ సమాజం, సోషలిజంలు ఏర్పాటు కావనీ - "సప్త క్రాంతి" (స్త్రీ - పురుష సమానత్వం, కులాల మధ్య

సమానత్వం, వర్గ సమానత్వం, ప్రాంతీయ, జాతీయ సా&ంథయిలో సమానత్వం, ప్రపంచ దేశ్వాల మధ్య సమానత్వం, విభిన్న వర్ణాల ప్రజల మధ్య సమానత్వం, వ్యక్తుల మధ్య స్వేచ్ఛతో కూడిన సమానత్వం) అనే భావనను సమాజ సిద్ధాంతాలలో ప్రవేశపెట్టిన విభిన్న విప్లవవాది.

అలాగే మార్క్స్ ఆలోచనలతో బాగా ప్రభావితం అయినాడు. కానీ వాస్తవ రూపం దాల్చడంలో పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో - ముఖ్యంగా ఇంగ్లాండ్, జనర్మనీ, అమెరికాల్లో సోషిలిస్ట్ విప్లవం రాకపోవడానికి కారణాలు వెదికే ప్రయత్నం చేశాడు. మార్క్స్ ప్రాథమిక ప్రతిపాదనలోని శ్రమ, విలువ, అధిక విలువల్లోని అసంపూర్తిని వివరించే ప్రయత్నం చేశాడు. తద్వారా ఇండియా లాంటి గత వలస దేశాలలో ఎందుకు "సోషలిజం" మార్క్స్ చెపిపనట్టుగా రాదో తెలియచెప్పే ప్రయత్నం చేసిన అరుదైన ఆర్థిక - రాజకీయ సిద్ధాంత కర్త. మార్క్స్ కాలంలో కానీ, ఇరవయివ శతాబ్దపు తొలినాళ్లలో కానీ - కాపిటలిస్ట్ ఆర్థిక వేత్తలు మినహాయిస్తే, అలాగే ఆస్ట్రియన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మినహాయిస్తే మార్క్స్‌ని విర్శించి ప్రత్యామ్నాయ "సోషలిజం" ప్రతిపాదనలు చేసిన వారు తక్కువ. రష్యన్ విప్లవం తరువాతి అనుభవాల నేపథ్యంలో కొందరు నిరాశ చెందిన మేధావులు దానిలోని నియంతృత్వ పోకడలను వివర్శించారు కాని మౌలిక ప్రాతిపదికను ప్రశ్నించలేదు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ - అమెరికన్ లాంటి సామాజిక దోపిడీకి గురైన దేశాలలో మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికతో సోషలిజం రాదనీ, వచ్చినా అది అత్యంత క్రూరత్వాన్ని సందరించకుంటుందనీ, ప్రత్యామ్నాయ సోషలిజం ప్రతిపాదన చేయం ఆయన ప్రత్యేకత. తమ మాట, తమ భాష, తమ వేదనా - తమకే అర్థం కాని విధంగా వలస వాదానికి గురైన దేశాలు, ప్రజలూ తయారయ్యారనే వాస్తవం తెలిపీ ప్రయత్నం చేసిన సాహసీ! ఇది ఈ దేశాల అదనపు గాయం!

అలాగే అప్పటికే బలంగా వున్న కుల సిద్ధాంతాలకు భిన్నంగా కులానికి, వర్గానికి వున్న అంతర్గత సంబంధం ప్రకటించి చరిత్ర కారుడ. చరిత్రకు linear progression ను కాదనీ అది ఓ చక్రం లా (The wheel of History) పయనించే విషయాల గుట్టుని కొత్తగా చెప్పిన గళం ఆయనది. అది ఉ న్నత, పతనాల మయమని వివరణ ఇస్తూ, దానికి ప్రధాన కారణం ఇప్పటిదాకా చరిత్రలో ఏదో ఒక కోణంలో అత్యంత నైపుణ్యం కోసం మాత్రమే ప్రయత్నం జరిగిందనీ, అన్నీ కోణాల నుండి, అనేక కోణాల నుండి సమగ్ర నైపుణ్యం దిశగా ప్రయాణం చేసినప్పుడే ఈ చక్ర నియమాన్ని అధిగమించగలం అని ప్రతిపాదించిన మార్మికుడు. అలాంటి ఓ కొత్త నాగరికత మనకు ద్వారాలు తెరచి ఎదురు చూస్తున్నదని, ఈ చరిత్ర చక్రపు గమనాన్ని మానవ ప్రయత్నంతో ఛేదించి ఆ కొత్త నాగరికతకు స్వాగతం పలకాలని కోరిన స్వాప్నికుడు.

ఈ దేశపు గాయాల తీవ్రత నిజంగా తెలిసిన దార్శనికుడు. అందుకే కేవలం వర్గం, కులం సమస్యల పరిష్కారంతో అన్ని సమస్యలు పరిష్కారం కావనీ, ఈ దేవపు చరిత్రలో ఇంకా ఎన్నో మాయని

గాయాలు వున్నాయని గమనించాడు. అగ్ర వర్ణాలు-అణగారిన వర్గాలు, మతం-హిందూ, ముస్లిం, క్రిస్టియన్, బుద్ధిస్ట్.. భాష-సంస్కృతం, ఇంగ్లీస్, దేశీయ భాషలు.. ప్రాంతీయత... ఈశాన్య ప్రాంతాలు, దక్షిణ భారతం, చుట్టూ వున్న దేశాల సమస్య... చైనా, పాకిస్తాన్... విదేశీ విధానం... తక్షణ, దీర్ఘకాలిక వ్యూహం... కళలు, సాహిత్యం, శిల్పం, నాట్యం, గానం.. ఇలా ఆయన ఆలోచన పరిధిలో పరిశీలనకు రాని విషయం లేదు. సమస్యల విశ్లేషణలో కూడా విశిన్నమైన మార్గం తీసుకుని, వాటిని చర్చించేప్పుడు ఈ దేశ ప్రజలకు అర్థం అయ్యే భాష, ఇమేజెస్, ఈ దేశపు జ్ఞాపకాల దొంతరలలో దాగిన కథల, గాథలు ఆధారంగా చేసిన ఏకైక వివేచనాపరుడు.

ఒక వైపు మార్క్స్ విశ్లేషణ పద్ధతులు తీసుకుంటూనే ఆచరణలో గాంధీ నుండి అహింస, సత్యాగ్రహంల కార్యచరణ, పారిశ్రామికీకరణలో ఈ దేశపు నియమిత వనరులు, పెట్టుబడి, అందువల్ల చిన్న యంత్రం లాంటి... విచిత్ర భావాలని స్వంతం చేసుకున్నాడు. అమెరికా - రష్యన్ వర్గాలని సమాన దూరంలో వుంచే వినూత్న ప్రక్రియను తీసుకుంటూనే రెండు దేశాల ఉన్నత విలువల్ని అంగీకరిస్తాడు. ప్రపంచంలోని అనేక విభిన్న విలువలని సార్వజనీన విలువలుగా ఎలా మార్చాలో చెప్పడానికి ప్రయత్నం చేసిన ఆఓలచనాపరుడు. ఇంత విభిన్నంగా, ఉన్నతంగా, వినూత్నంగా ఆలోచనలు చేసిన రాజకీయ తాత్కాలిక ప్రయోజనాలు, సిద్ధాంత స్వచ్ఛతల మధ్య కొంత సంఘర్షణకు లోనయ్యినట్టే అర్థం అవుతుంది. కానీ ఏది ఏమైనా - ఈ దేశపు గాయాలను బాగా అర్థం చేసుకున్న వాడు, అన్ని వైఫల్యాల మధ్య తన దేశపు గాయాలకు శాశ్వతమైన మందు కనుక్కోవాలని ప్రతి క్షణం పరితమపించిన ఋషి! విరామమెరుగని క్షోభకు గురైన ఆత్మ!

లోహియా విజయం, ఓటమి చరిత్ర నిర్ణయిస్తుంది. జార్జ్ వాల్లేస్ కూడా బహుశః అమెరికన్ ప్రజల గాయాలు తెలిసిన వాడేనేమో! కానీ ఆచరణలో సకారాత్మకత లేదు. ఇదీ వారి మధ్య సామీప్యత, తేడా!

(మార్చ్ 23 వీరుల సమస్మరణ దినం. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖ్ దేవ్‌ల బలిదానం దేశాన్ని కదిలించిన దినం. తన పుట్టిన రోజును షహీద్ దినంగా చేసుకోమని కోరిన లోహియా సంస్మకరణ దినోత్సవం సందర్భంగా!)